నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 144 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
07-04-2026 మంగళవారం వెల : 1 /- పేజీలు : 4

# వ్యాయామమే ఆరోగ్యానికి బలం...

- మారుతున్న జీవనశైలిపై హెచ్చరిక
- చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్న ప్రజలు
- నడక, యోగా, క్రీడలపై అవగాహన అత్యవసరం
- ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి
- సైక్లింగ్, వాకింగ్ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు అవసరం
- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అందరి బాధ్యత
- పర్యావరణ రక్షణతో పాటు జీవనశైలిలో మార్పులు అవసరం



**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం:**

మారుతున్న ఆధునిక జీవనశైలిలో మనిషి ఆరోగ్యంపై నిర్లక్ష్యం పెరుగుతోంది. సౌకర్యాల పెరుగుదలతో శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల చిన్న వయసులోనే అనేక రోగాలు ప్రజలను వేధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరిగా మారింది. ఇటీవల కాలంలో కొంతమంది మాత్రమే నడక, యోగా, కరాటే, కుంగ్‌ఫూ, జిమ్ వ్యాయామాలు చేస్తుండగా, ఇంకా చాలా మంది పూర్తిగా శారీరక శ్రమకు దూరమవుతున్నారు. దీంతో మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం ప్రధాన కారణంగా నిపుణులు పేర్కొంటున్నారు.

### నడక తగ్గిపోతున్న వాస్తవం

ప్రస్తుతం చిన్న దూరాలకు కూడా వాహనాల వినియోగం విపరీతంగా పెరిగింది. బైక్‌లు, కార్లు, ఆటోలు లేకుండా నడవడం చాలా మందికి అలవాటే లేకుండా పోయింది. నడక వంటి సులభమైన వ్యాయామాన్ని కూడా నిర్లక్ష్యం చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితిని మార్చేందుకు సమాజంలో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### ప్రభుత్వాలు ముందుకు రావాలి

వ్యాయామం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి. నడక సంఘాలు, యోగా శిబిరాలు, క్రీడా పోటీలు, సైక్లింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం పెంచాలి. ముఖ్యంగా సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తే యువతలో ఆసక్తి పెరుగుతుంది.

### స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

సమాజంలో మార్పు తీసుకురావడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా ఎంతో ముఖ్యమైనది. గ్రామాలు, పట్టణాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికి వ్యాయామం అవసరాన్ని తెలియజేయాలి.

### ఆరోగ్యమే సంపద

మనిషి ఆరోగ్యంగా ఉంటే అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. దీని వల్ల వ్యక్తిగత ఖర్చులతో పాటు ప్రభుత్వ వైద్య వ్యయాలు కూడా తగ్గుతాయి. అందుకే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి.

### పర్యావరణ పరిరక్షణ కూడా అవసరం

శారీరక ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణపై కూడా దృష్టి పెట్టాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించి గుడ్డ సంచులను ఉపయోగించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించవచ్చు.

# మూలపేట పోర్టు 70% పూర్తి... ఈ ఏడాది ఆపరేషన్ల లక్ష్యం



- మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలన
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలక ప్రాజెక్టు
- కేంద్రం నుంచి ఉప్పు భూములు లీజుకు
- పనుల్లో వేగం... గణనీయ పురోగతి
- రవాణా, మౌలిక వసతులపై దృష్టి
- స్థానికులకు ఉపాధి అవకాశాలు

3లో



# ప్రతి చుక్క నీరు రైతుకే... నీటి భద్రతపై దృఢ సంకల్పం

- బూర్జలో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం
- సాగునీటి సంఘాల బాధ్యత పెంపుపై ఎమ్మెల్యే పిలుపు
- కాలువలు, చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- ప్రజా భాగస్వామ్యంతో నీటి నిర్వహణకు ప్రోత్సాహం
- గ్రామీణ నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యం
- రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**నవతరం -బూర్జ**



ప్రతి నీటి చుక్కను సమర్థంగా వినియోగించి రైతులకు మేలు చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత' 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం బూర్జ మండలం కాలపర్తి పంచాయతీలో ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపుదిద్దిందని తెలిపారు. సాగునీటి వనరుల అభివృద్ధి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు.

**ప్రజా భాగస్వామ్యంతోనే ఫలితాలు**

నీటి నిర్వహణలో పారదర్శకత కీలకమని, రైతులు మరియు ప్రజల భాగస్వామ్యంతోనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని కూన రవికుమార్ పేర్కొన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కాలువల పూడికతీత, శుభ్రపరిచే పనులు, చెరువుల పునరుద్ధరణ వంటి పనులను వేగవంతంగా చేపడతామని తెలిపారు.

**నీటి నిల్వ సామర్థ్యం పెంపే లక్ష్యం**

నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను పూర్తిగా అధిగమించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. సాగునీటి సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యం... నేరడి బ్యారేజీతో జిల్లా సస్యశ్యామలం



- నీటి భద్రత కార్యక్రమానికి మంత్రి అచ్చెన్నాయుడు శ్రీకారం
- వంద రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశం
- చెరువులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- ప్రజా భాగస్వామ్యంతో నీటి నిర్వహణ
- ఖరీఫ్ నాటికి నీటి అందుబాటు లక్ష్యం
- సాగునీటి సంఘాలకు కీలక బాధ్యతలు

2లో

# దాడి కేసులో జాప్యం అసహ్యం...
# జర్నలిస్టుల భద్రతపై ఆందోళన

- అక్కురాడ ఘటనలో నిందితుల అరెస్ట్‌లో ఆలస్యం
- బాధితులపై రాజీ ఒత్తిళ్లు, బెదిరింపులు
- ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన IFWJ నాయకులు
- కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ
- బాధితులకు రక్షణ కల్పించాలని ఆదేశాలు
- నిందితులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**నవతరం-శ్రీకాకుళం**

జలుమూరు మండలం అక్కురాడ గ్రామంలో జర్నలిస్టు కుటుంబంపై జరిగిన ప్రాణాంతక దాడి కేసులో ఆలస్యం జరుగుతుండటంపై ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (×ఖీఔజీ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు జిల్లా ఎస్పీని కలిసి పూర్తి వివరాలు తెలియజేసి, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ×ఖీఔజీ ఏపీ స్టేట్ ఇన్‌చార్జ్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎన్. ఈశ్వరరావు మాట్లాడుతూ, జర్నలిస్టు కుటుంబంపై జరిగిన దాడి అత్యంత దారుణమని, కేసు నమోదు అయినప్పటికీ నిందితులను ఇప్పటికీ అరెస్ట్ చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని అన్నారు. బాధితులపై రాజీకి ఒత్తిళ్లు, బెదిరింపులు కొనసాగుతున్నాయని, ఇది చట్టాన్ని సవాలు చేసే చర్యలని ఖండించారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుల వివరాల ప్రకారం, కుంచి అప్పలస్వామిపై ఇనుప రాడ్లతో దాడి చేసి తీవ్ర గాయాలు కలిగించగా, కుంచి కామేశ్వరరావుపై కత్తితో దాడి చేయడంతో చేతి వ్రేళ్లు తెగిపోవడం, వినికిడి సమస్యలు తలెత్తినట్లు వైద్య నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇలాంటి ఘటన జరిగినప్పటికీ నిందితులు బయట తిరగడం వల్ల బాధిత కుటుంబం భయాందోళనలో ఉందని తెలిపారు.

### ఎస్పీ స్పందన కీలకం

ఫిర్యాదును స్వీకరించిన జిల్లా ఎస్పీ కేసును సీరియస్‌గా తీసుకుని, సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు, నిందితులపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎంవీ మల్లేశ్వరరావు, చిన్నారావు, సత్యనారాయణ, నవచైతన్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో విద్యకు కొత్త దిశ..
# సంస్కార్ సమన్వయ్ ఘన విజయోత్సవం

- అట్టహాసంగా సంస్కార్ స్కూల్ 8వ వార్షికోత్సవం
- మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వైభవంగా వేడుకలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగైన విద్య అందిస్తున్న సంస్థ
- ప్రతిభా ప్రదర్శనలతో మెరిసిన విద్యార్థులు
- విద్యా, క్రీడా, సాంస్కృతిక రంగాల్లో సమగ్ర అభివృద్ధి
- సర్టిఫికెట్ల ప్రదానంతో ప్రోత్సాహం






**నవతరం-శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లాలో విద్యా రంగానికి కొత్త దిశను చూపిస్తూ సంస్కార్ సమన్వయ్ నేపథ్యంతో సంస్కార్ ఇంటర్నేషనల్ స్కూల్ 8వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలు విద్యార్థుల ప్రతిభ, పాఠశాల ప్రగతిని ప్రతిబింబిస్తూ విశేషంగా ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మున్సిపల్ కమిషనర్ హనుమంతు కుర్మారావు, డీఈఓ రవిబాబు, ఎమ్మెల్యే కూన రవికుమార్, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, డా. రాహుల్ దేవరాజ్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.

### అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు




### ప్రశంసనీయం

11 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థ జిల్లాలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని అతిథులు అభిప్రాయపడ్డారు. క్రీడా మైదానాలు, ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ విద్యా వనరులు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని పేర్కొన్నారు.

### స్థానికంగానే ఉన్నత విద్య లక్ష్యం


డైరెక్టర్లు డా. దుంపల హరిప్రసాద్ రావు, డా. అన్నెపు శివప్రసాద్ రావు, డా. పైలా మురళీధర్ రావు, డా. తమ్మినేని వేణుగోపాల్ రావు, డా. బుడమూరు అన్నాజీ రావు, కరస్పాండెంట్ దుంపల అరుణ మాట్లాడుతూ, ఉన్నత విద్య కోసం బయట నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితిని మార్చాలనే సంకల్పంతో ఈ సంస్థను ప్రారంభించినట్లు తెలిపారు. ఎనిమిదేళ్లలోనే ఈ విద్యాసంస్థ జిల్లాలో ఆదర్శంగా నిలిచిందని గర్వంగా పేర్కొన్నారు.

### విద్యా ప్రమాణాల్లో ముందంజ

అకాడమిక్ డైరెక్టర్ సాయి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సృజన, డిల్లీశ్వరరావు మాట్లాడుతూ 2025--26 విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన విజయాలు, పోటీ పరీక్షల ఫలితాలు, క్రీడా మరియు సాంస్కృతిక రంగాల్లో సాధించిన ప్రతిభను వివరించారు. నూతన బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు.

### సాంస్కృతిక ప్రదర్శనల సందడి

గీతాలాపనలు, నృత్యాలు, కరాటే, పిరమిడ్ ప్రదర్శనలు, వెస్ట్రన్, క్లాసికల్ డాన్స్, కీబోర్డ్ నాటికలతో విద్యార్థులు ప్రేక్షకులను అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు.
ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.



# శ్రీకాకుళంలో ఘనంగా పునరుత్థాన ర్యాలీ





**నవతరం-శ్రీకాకుళం**

- ఈస్టర్ సందర్భంగా విశ్వాసుల భారీ పాల్గొనం
- యేసుక్రీస్తు పునరుత్థాన సందేశం ప్రసారం
- దారిపొడవునా కేకులు పంచిన భక్తులు

జిల్లా పాస్టర్స్ -లీడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం పట్టణంలో ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని పునరుత్థాన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఏడు రోడ్ల కూడలి, డే-నైట్ కూడలి వరకు కొనసాగింది. యేసుక్రీస్తు పునరుత్థాన సందేశాన్ని ప్రజలకు చాటిచెబుతూ, దారిపొడవునా కేకులు పంచారు. జిల్లాలోని పలాస, ఆముదాలవలస, గార, నరసన్నపేట, రాజాం తదితర ప్రాంతాల నుంచి విశ్వాసులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యం...
# నేరడి బ్యారేజీతో జిల్లా సస్యశ్యామలం

**నవతరం-శ్రీకాకుళం**

భూగర్భ జలాల పెంపొందనకు సమగ్ర చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. 'నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత' వంద రోజుల ప్రత్యేక కార్యక్రమానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీరు మానవాళి మనుగడకు అత్యంత కీలకమని, వర్షపు నీటిని నిల్వచేయడం ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుకోవాలని సూచించారు. చెరువులు, కాలువల పూడికతీత, పునరుద్ధరణ పనులను వేగవంతంగా చేపట్టి వంద రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.
నేరడి బ్యారేజీతో మార్పు
నేరడి బ్యారేజీ పూర్తి అయితే జిల్లా సస్యశ్యామలం అవుతుందని, రెండు పంటలకు నీటి అందుబాటు కలుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ప్రజా భాగస్వామ్యమే కీలకం
సాగునీటి సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఖరీఫ్ నాటికి ప్రతి ఎకరాకు నీరు అందేలా కృషి చేయాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో భూగర్భ జలాల పెంపు కోసం సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిర్దేశిత మెనూను అందజేయాలి

- మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలి
- డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ సంద్ర

**నవతరం -ఎచ్చెర్ల**



నిర్దేశిత మెనూను అందజేయాలని డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ సంద్ర అన్నారు. రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఐఐఐ లో డైరెక్టర్ సంద్ర అమరేంద్ర కుమార్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మెస్ సందర్శించారు. ఉదయం తయారుచేసిన అల్పాహారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులుతో కలిసి సహపంక్తి అల్పాహారం చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు అందజేసిన ఆహారం క్వాలిటీ విషయంలో యెక్కడా రాజీ పడవద్దుఅని ఐఐఐటి అధికారులను ఆదేశించారు.
శ్రీకాకుళం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణ ముని, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్లు సింహాచలం యోగేశ్వరి మరియు క్యాంపస్ 2 ఇంచార్జి సాగర్ మెస్ కోఆర్డినేటర్లు , మెస్ కమిటీ సభ్యులు మెస్ లను సందర్శించారు. ఆహారం తయారీకి వాడే అన్ని పదార్థాల నాణ్యత ను పరిశీలించారు. డైరెక్టర్ సంద్ర అమరేంద్ర కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ మెరుగైన ఆహారం అందించడం ద్వారా విద్యార్థినీ విద్యార్థులు విద్యపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. నాణ్యమైన ఆహారం అందించడం లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.
ఈ కార్యక్రమంలో పరిపాలనఅధికారి ముని రామకృష్ణ ,డీన్ అకడమిక్స్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ఫిజిక్స్ డిపార్ట్మెంట్ విభాగపతి శ్రీధర్ ఉద్యోగులు, సహచర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పుస్తకాలను భద్ర పరచుకోలేమా?

రెండు తెలుగు రాష్ట్రాలలో పదవ తరగతి పరీక్షలు ముగిసాయి.టెన్త్,ఇంటర్ పరీక్షలు పూర్తి కాగానే ప్రైవేటు పాఠశాల బస్సులనిండా పిల్లలు కేరింతలు కొడుతూ, కాకుంటే పెద్దగా అరుస్తూ ఆయా పాఠశాలల హాస్టళ్ళకో!కాకుంటే ఇళ్ళకో విద్యార్థులు మూకుమ్మడిగా వెళుతుంటారు?పరీక్ష చివరి రోజు పరీక్ష పూర్తి కాగానే,పరీక్షా కేంద్రాల ముందు, కాకుంటే కొన్ని ప్రదానకూడళ్ళలో తమ విలువైన పుస్తకాలను, ఏడాది పొడవునా తామురాసుకున్ననోట్సులను ముక్కలుగా చించి విసిరేయడం,లేదా పరస్పరం స్నేహితుల చొక్కాలపై ఇంకుజల్లుకోవడం, మూకుమ్మడిగా కేకలు పెట్టడం తాజా ఆనవాయితీ గా మారింది.అదే విధంగా కొన్ని చోట్ల పాఠశాలల్లో ఉన్న సామాగ్రిని పాడు చేయడం వంటివి చేస్తున్నారు. లేదా తమకున్న వ్యక్తిగత కక్షలని పాఠశాలలను వేదికగా చేసుకొని తీర్చుకుంటున్నారు.

ప్రైవేటు పాఠశాల విద్యార్థులలో మొదలైన ఈ అలవాటు, జాడ్యం ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లోకి కూడా ఎగబాకింది.అదే విధంగా ఏప్రిల్ 23న విద్యా సంవత్సరం ముగుస్తుంది. సీనియర్స్ దారిలోనే క్రింది తరగతల వారు కూడా నడిచే అవకాశం ఉంటుంది.గతంలో విద్యార్థులు తమ పాఠ్య పుస్తకాలకు అట్టలు వేసుకొని మంచిగా ఉంచుకునే వారు. ,అవసరం అయితే భద్రంగా తన చెల్లి, తమ్ముడు లేదా తమ జూనియర్స్ కి ఇచ్చే ఆనవాయితీ ఉండేది.లేదా ఇంట్లో భద్రపరుచుకునేవాళ్ళు.భవిష్యత్ లో అవి వారికి పోటీ పరీక్షలకు ఉపయోగ పడేవి.

మరి ఈ మార్పు ఎందుకు వస్తుంది?మానవ సంబంధాల లో వచ్చిన మార్పులే ఇలాంటి సంస్కృతి ప్రభలటానికి కారణం అవుతుంది.ప్రభుత్వ పాఠశాలల ఆదిపత్యం ఉన్నప్పుడు విద్యార్థి తన తల్లిదండ్రులకు పనిలో సహకరిస్తూ,శ్రమపట్ల గౌరవం కలిగిఉండేవారు.తమ కుటుంబం ఎదుర్కొనే సవాళ్ళలో సైతం వీరికి అనుభవం, భాగస్వామ్యం ఉండేది.కార్పొరేట్ విద్యావ్యవస్థ ప్రాబల్యం లోనికిసమాజం వచ్చిన తర్వాత విద్యార్థి వసతిగృహాల్లోకి చిన్న తనంలోనే పంపడం వలన, కుటుంబంతో అనుబంధం తెగిపోయింది.కార్పొరేట్ విద్యావ్యవస్థ మూలంగా వ్యాపార సంబంధాలుగా విద్యార్థులుమారిపోతున్నారు. ఫలితంగా వాళ్ళు పుస్తకాల పురుగులుగానే పెరుగుతున్నారు.ఎప్పుడూ చదువు అనే వత్తిడి తప్ప తమ సమవయసు బృందం తో స్వేచ్ఛగా ఆడుకునే ఆటలు, ఇష్టమైన స్నేహంకు సైతం దూరం అవుతున్నారు.ఫలితంగా సామాజిక సమస్యలు పట్టని పౌరులుగామారుతున్నారు.

సవాళ్ళను ఎదుర్కోలేని సున్నితమైన మనస్తత్వం తో ఎదుగుతున్నారు.ఒకరకంగా పారం కోడిపిల్లలా పెరుగుతున్నారు.

ప్రస్తుతం ఉపాధ్యాయ సిబ్బందికి, విద్యార్థులకు మధ్య కృత్రిమ సంబంధాలు మాత్రమే ఉన్నాయి. దీని వల్ల బోధనలో సహజత్వం పోతుంది.విద్యాహక్కు చట్టం2009ప్రకారం ఏతరగతికైనా రెండు రకాల పరీక్షలు ఉంటాయి. 1) నిర్మాణాత్మక మూల్యాంకనం (ఫార్మేటీవ్ఎసెస్మెంట్,యఫ్ఏ-4).ఇదిఏడాదిలో నాలుగు పర్యాయాలు జరగాలి.దీనిలో చదవడం,రాయడం, ప్రాజెక్టు పని, స్లిప్ టెస్టు ఈ నాలుగు అంశాలు బోధించిన ఉపాద్యాయులు పర్యవేక్షణలో సున్నితంగా చాలా రొటిన్ గా జరుగుతాయి. 2) సంగ్రాహనాత్మక మూల్యాంకనం (సమ్మేటీవ్ అసెస్మెంట్,యస్ఏ-2)ఇవి సంవత్సరంలో సబ్జెక్టును రెండు భాగాలుగా విభజించియస్ఏ-1,యస్ ఏ-2 రెండు పార్టులు గా నిర్వహించబడతాయి.వీటిలో విద్యార్థి నేర్చుకున్న విద్యాసామర్థ్యాలు అంచనా వేయబడతాయి.ఇవి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాద్యాయులు భాగస్వామ్యంలోనే జరుగుతాయి.ఇదికూడా ఒకరకంగా వత్తిడి లేని మూల్యాంకనం ప్రక్రియ.పాఠ్యాంశాలు, అభ్యసనానుభవాలు పొందేసందర్భంలో వత్తిడి లేకుండా జరిగే విధానం.అంటే పరీక్షలు పరీక్ష లాగా కాకుండా ఓ సమీక్ష లాగా ఉండాలి.గతంలో ఆంధ్రప్రదేశ్ లో పరీక్షలు మూడు రకాలుగా పెట్టారు . కొన్ని పరీక్షలకు, పాఠ్య పుస్తకాల్లో ఉన్న అంశాలకు పొంతన లేదు.


పాఠశాలల్లో విద్యార్థులు ప్రశ్నలు వేసే వాతావరణం ఉండాలి. (అంటే ఎదుటి ప్రశ్నలు కాదు ). దీని నుంచే వారికి విశ్లేషణ శక్తి వస్తుంది. సున్నితంగా విమర్శించే లక్షణం కూడా వారిలో పెరుగుతుంది. కరోనా సంక్షోభం తర్వాత విద్యా ప్రణాళికలలో జాగ్రత్తగా అడుగు వేయాల్సిన పాలక వర్గాలు, అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సిలబస్ భారం పెంచుతున్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్ ఏ మేరకు అవసరం అనే విషయంపై శాస్త్రీయ అధ్యయనం చేయాలి . అవసరం అయిన మేరకే డిజిటల్ విద్యను ప్రవేశ పెడుతున్నారు. ఉపాధ్యాయ సిబ్బందికి బోధనలో స్వేచ్ఛ ఉండాలి.అదే విధంగా మానిటరింగ్ సిస్టం కూడా పటిష్టంగా ఉండాలి. తల్లి దండ్రుల పర్యవేక్షణ కూడా చాలా అవసరం. తమ పిల్లలపై వారు సరైన అంచనాకు రావాలి. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలి. విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ఒక భాగం మాత్రమే అని అందరూ గ్రహించాలి. కొందరి పిల్లల్లో పెరుగుతున్న విపరీత ధోరణులకు సినిమాలు, సోషల్ మీడియా, కొంతమంది తల్లి దండ్రుల అతి గారాబం కూడా కొంత వరకు కారణం.

ఉపాధ్యాయ సిబ్బంది కూడా బోధనలో కొత్త పద్ధతులను ఎంచుకోవాలి. వారితో నిరంతరం మాట్లాడాలి. పిల్లల విషయంలో సమిష్టి నిర్ణయాలు తీసుకోవాలి. వారి కులం, మతం వంటి విషయాల్లో ఉపాధ్యాయ సిబ్బంది తటస్థ వైఖరిని అనుసరించాలి. వారి ముందు ఉపాధ్యాయ సిబ్బంది పరస్పరం విమర్శలు చేసుకోకూడదు. నైతిక విలువ ల బోధనకు కొంత సమయం కేటాయించాలి. అప్పుడే ఇటువంటి అరాచక పరిస్థితులు అదుపులో ఉంటాయి.అదే విధంగా విద్యా విధాన రూప కల్పనలో నిపుణుల సలహాలు తీసుకోవాలి. విద్యార్థులపై ఏ భాషను బలవంతంగా రుద్దకూడదు. ప్రాథమిక విద్యను మాతృ భాషలో కొనసాగించాలి. వంద శాతం ఫలితాలు రావాలని ఉపాధ్యాయ సిబ్బందిపై ఒత్తిడి తేకూడదు. విద్యార్థులకు ప్రాథమిక అంశాలపై పట్టు వచ్చేలా చూడాలి.వేసవి సెలవుల్లో చదువుకోవడానికి వీలుగా విద్యార్థులకు లైబ్రరీ బుక్స్ ఇవ్వాలి. పుస్తకాలు చదవమని వారిని ప్రోత్సహించాలి. అప్పుడే వారికి పుస్తకాల విలువ తెలుస్తుంది.



యం.రాం ప్రదీప్

# జీరో అనుకున్న కానీ హీరోనే...



ఒక చిన్న గ్రామంలో రవి అనే అబ్బాయి ఉండేవాడు.అతను చాలా తెలివైనవాడు...కాని ఒక అలవాటు---కష్టాలు వచ్చినప్పుడు వెంటనే బాధపడేవాడు.రవి తండ్రి రామయ్యది ...కఠిన స్వభావం.చిన్న తప్పు చేసినా గట్టిగా మందలించేవాడు.రవి మనసులో ఒక్క మాట తిరుగుతుండేది..."నాన్న ఎందుకు నన్ను ఇంతగా బాధ పెడతాడు?"ఒక వేసవి రోజు...ఎండ మండిపోతోంది.రవి బయటకి వెళ్లి కొద్దిసేపట్లోనే అసహనంగా ఇంటికి వచ్చేశాడు."ఈ సూర్యుడు ఎందుకు ఇలా మండిపోతున్నాడు?బయట ఉండలేకపోతున్నాం!"అని కోపంగా అన్నాడు.అప్పుడు అమ్మమ్మ నెమ్మదిగా నవ్వింది..."రవి...నీకు ఈ ఎండ బాధగా అనిపిస్తుంది కదా?""అవును అమ్మమ్మ...చాలా ఇబ్బంది!"అన్నాడు.అమ్మమ్మ ఆకాశం వైపు చూపిస్తూ చెప్పింది:"ఈ సూర్యుడు కొన్నిసార్లు బాధ పెడతాడు...కాని అదే సూర్యుడు లేకపోతే...ఈ ప్రపంచానికి వెలుగు ఎక్కడి నుంచి వస్తుంది?"రవి కాస్త ఆలోచించాడు.అమ్మమ్మ మళ్లీ చెప్పింది:"మన జీవితంలో కూడా అలాంటివాళ్లు ఉంటారు బంగారం...ఇప్పుడు బాధ పెడతారు...కాని మన భవిష్యత్తుకి వెలుగు అవుతారు..."ఆ మాటలు రవి మనసులో నిలిచిపోయాయి.కొన్ని రోజుల తరువాత...రవి పరీక్షలో తక్కువ మార్కులు తెచ్చుకున్నాడు.రామయ్య గట్టిగా మందలించాడు.ఈసారి...రవి ఏడవలేదు... కోపపడలేదు... ఆలోచించాడు..."నాన్న బాధ పెడుతున్నాడు...కాని నా భవిష్యత్తు కోసం..."ఆ రోజు నుంచి...రవి మరింత శ్రద్ధగా చదవడం మొదలుపెట్టాడు.తండ్రి మందలింపు...అతనికి ప్రేరణగా మారింది.కొన్ని సంవత్సరాల తరువాత...రవి పెద్ద ఉద్యోగం సంపాదించాడు.ఒక రోజు...తండ్రి చేతిని పట్టుకుని అన్నాడు:"నాన్న...మీరు అప్పట్లో నన్ను బాధపెట్టారు...కాని ఆ బాధే నాకు వెలుగు అయింది..."రామయ్య కళ్లలో ఆనందం మెరిసింది.బాధ పెట్టేవాడు ఎప్పుడూ శత్రువు కాదు...కొన్ని బాధలు మన జీవితానికి వెలుగై మారుతాయి...సూర్యుడు ఎండతో బాధ పెడతాడు...కాని అదే సూర్యుడు ప్రపంచానికి జీవం ఇస్తాడు...

రచన : తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
చరవాణి:9297109223
హైదరాబాద్ 500037

# అంజనీ పుత్రుని అమర గాథ...



శ్రీ సీతారాముల
కళ్యాణం చూతము రారండి...!
శ్రీ రామాయణ గాథను
పారాయణం చేద్దాం రారండి...!
మహర్షి వాల్మీకిచే విరచితమైన
శ్రీ మద్రామాయణంలో
వీరభక్తితో విరాజిల్లిన వానర శ్రేష్ఠుడు
శ్రీ అంజనీ పుత్రుని
అమరగాథను విందాం రారండి..!

సకలగుణ సంపన్నుడు
సీతారాములకు నమ్మిన బంటు
లంకా వారధి...నిర్మాణ సారథి...!
వాయువేగంతో లంఘించే వజ్రశిఖరం...
వాయు సుతుడు...గుణవంతుడు...
బలవంతుడు మన హనుమంతుడు...!

వాక్చాతుర్యంతో పలికే పలుకుల్ని
మధుర రస ధారలుగా మంత్రించే..ఓ
మాటల మాంత్రికుడు మన హనుమాన్..!

రఘువంశ తిలకునికి...
దశరథ నందనుడికి దాసుడు...
ఓ దివ్యశక్తి దీపధారి...వీర హనుమాన్...!

దివ్యమైన రామనామం నవనాడుల్లో
నింపుకున్న నిత్యసత్య స్వరూపుడు...!

అరణ్యాంధకారంలో ఆశారేఖగా మెరిసి...
కన్నీటి కడలిలో కాంతి తారకగా నిలిచి...
అశోకవనంలో సూక్ష్మరూపంలో...తల్లి
సీతమ్మను తిలకించి పులకించి...తండ్రి
రామయ్య అనురాగ సందేశాన్ని అమ్మకు
అందించిన అంజనీ పుత్రుడు హనుమాన్..!

అశోక్ వనంలో సీతమ్మ తల్లి
అనుభవించే మానసిక క్షోభను..
కనులారా గాంచి చిత్తం చలించి
రక్తం ఉడికి గుండె రగిలి పగిలి
ఆపై ఉరుమై...ఉరిమి
మెరుపై...మెరిసి ఉగ్రరూపం దాల్చి...
అగ్నిజ్వాలల్లో లంకను కాల్చి బూడిదచేసి..!
"రావణుడికి యముడు"
"రాముడు కాదు రామబంటు"
"హనుమంతుడేనని"
లంకాధిపతిని హడలెత్తించిన...
సీతమ్మ ముఖాన చిరుమందహాసాన్ని
గాంచిన అంజనీపుత్రుడు ఆంజనేయుడు..!
రణ క్షేత్రానికి రమ్మని...
రామునితో యుద్దానికి సిద్ధం
కమ్మని...రావణాసురునికి రాముని
రణభేరి నినాదాన్ని వినిపించి
విజయద్వారాలకు పునాదులు వేసిన
రణరంగ ధీరుడు...పరాక్రమశాలి
రామదూత మన వీర హనూమాన్...!
లక్ష్మణుడు యుద్ధంలో మూర్ఛిల్లిన వేళ...
వేలవేల యోజనాలు క్షణాల్లో లంఘించి
వెతికి వెతికి సంజీవని పర్వతాన్ని
మోసుకొచ్చిన ప్రాణదాత మన హనుమాన్..!
సాగరుని సాక్షిగా
రామసేతు నిర్మాణంతో నిత్యం
శ్రమించిన వానరసేనకు మార్గదర్శకుడు
మహోన్నతుడు మన వీర హనూమాన్..!
భక్తికి మారు పేరైన ...

బలానికి ప్రతిరూపమైన...
సాహసానికి ప్రత్యక్ష సాక్షియైన...
దాస్యానికి దివ్య కిరీటమైన...
ఓ అంజనీ పుత్రా..!
ఓ అభయాంజనేయా..! మీకు
ప్రణామాలు..! సాష్టాంగ ప్రణామాలు..!
అజరామరం మీ అఖండ కీర్తి..
మీ స్మరణే ఒక ప్రేరణ...ఒక స్ఫూర్తి...
గుడిలోను మీ గుండెలోను కనిపించే
మన ఆరాధ్య దైవం శ్రీ రామచంద్రమూర్తి
మీ సేవే నిత్య కళ్యాణం పచ్చ తోరణం...
మీ చరణకమలాలలో ఉప్పొంగు భక్తిగంగ.



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం
- ఘనంగా 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి

**నవతరం-రణస్థలం**



ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రణస్థలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య పార్టీగా బీజేపీ ఎదిగిందని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తూ దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూలపేట పోర్టు 70% పూర్తి... ఈ ఏడాది ఆపరేషన్ల లక్ష్యం

**నవతరం-శ్రీకాకుళం**



మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతూ ఇప్పటికే సుమారు 70 శాతం పూర్తయ్యాయని రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి సోమవారం ఆయన పోర్టు పనులను పరిశీలించారు.

అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రులు, పనులను వేగవంతం చేసి ఈ ఏడాది చివరినాటికి పోర్టు ఆపరేషన్లు ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

రూ. 4,361 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో బ్రేక్‌వాటర్, డ్రెడ్జింగ్, బెర్త్ నిర్మాణ పనులు గణనీయంగా పూర్తయ్యాయని వివరించారు. ఉత్తరాంధ్రతో పాటు చత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఒడిశా ప్రాంతాలకు ఈ పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు.

పోర్టు అవసరాలకు కేంద్రం నుంచి ఉప్పు భూములను లీజుకు పొందినట్లు తెలిపారు. రహదారి, రైల్వే కనెక్టివిటీతో పాటు మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు.

స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని, పునరావాస కాలనీలను మెరుగ్గా అభివృద్ధి చేస్తున్నామని మంత్రులు తెలిపారు.

# టెక్కలిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- "ఘనంగా మన ఊరు -మన జెండా" కార్యక్రమం
- పంచాయతీల్లో పార్టీ జెండా ఆవిష్కరణ
- కార్యకర్తల అంకితభావంపై నేతల ప్రసంగాలు

**నవతరం-టెక్కలి**

టెక్కలి మండలంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "మన ఊరు మన జెండా" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి, తొలుసురిపల్లి, తెర్లంగి పంచాయతీల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ దేశ సేవే లక్ష్యంగా, ప్రజల అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ ముందుకు సాగుతోందని తెలిపారు.
ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తూ దేశాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జర్జాన రాంజీ, జిల్లా ఉపాధ్యక్షుడు నడుపూర్ లక్ష్మీనారాయణ, యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరీ నరేంద్ర, గుణ మీనాకుమార్, ధూపాన కామేశ్వర్ రెడ్డి, పోటోజు నాగేంద్ర తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శించిన మంత్రి



- ఆర్&బి మంత్రి బి.సి. జనార్ధన రెడ్డి పూజలు
- ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి దర్శనం
- వేదమంత్రాలతో ఆశీర్వచనం, ఘన స్వాగతం

**నవతరం-శ్రీకాకుళం**

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్‌డబి శాఖ మంత్రి బి.సి. జనార్ధన రెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్ సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

# తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అమలు చేయాలి

- హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని సిఐటియు డిమాండ్
- తక్కువ వేతనాలతో పని శ్రమ దోపిడీ అని విమర్శ
- సమాన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



**నవతరం-నరసన్నపేట**

తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సిఐటియు నరసన్నపేట కమిటీ డిమాండ్ చేసింది. దశాబ్దాలుగా తక్కువ వేతనాలతో తాత్కాలిక ఉద్యోగులతో పని చేయించడం శ్రమ దోపిడీ అని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, ఎన్‌ఎంఆర్, డైలీవేజ్ తదితర ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరింది.
రెగ్యులరైజేషన్ వరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసింది.
అంగన్‌వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు వంటి వారినీ ఇందులో చేర్చాలని పేర్కొన్నారు.

# రహదారి పనులను పరిశీలించిన బీసీ సెల్ నేత



- గత ప్రభుత్వ నిర్లక్ష్యంపై కామేశ్వరరావు విమర్శలు
- కూటమి ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం
- పెట్రోల్ బంక్-అక్కుపల్లి రోడ్డుకు కొత్త ఊపిరి

**నవతరం-పలాస**

పలాసలో పెట్రోల్ బంక్-అక్కుపల్లి రహదారి నిర్మాణ పనులను బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత వైఎస్ఆర్‌సిపి పాలనలో రహదారి నిర్లక్ష్యానికి గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు.
నిధులు కేటాయించకుండానే అభివృద్ధి పేరుతో పనులు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే శిరీష చొరవతో ఈ రహదారికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని తెలిపారు. ఉద్దాన ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దడియాల నరసింహులు, తారక రమేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బావితర పౌరులకు "శాంతి మంత్రం" ఆయుధం కావలి



- లయన్ నటుకుల.మోహన్

**నవతరం-శ్రీకాకుళం**

బావితర పౌరులకు "శాంతి మంత్రం" ఆయుధం కావలని, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం మెంటార్ లయన్ నటుకుల.మోహన్ అన్నారు. లయన్స్ క్లబ్ అంతర్జాతీయ శాంతి పోస్టర్ 2025 - 26 పోటీలలో, నగరంలో గల భాష్యం పాఠశాల విద్యార్థి ఎల్.వినోద్ జిల్లా స్థాయిలో మెరిసారని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ బృందం తెలిపింది. ఇందులో భాగముగా లయన్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న కళాశాల నైపుణ్యాలను వెలికితీయడం అందరి బాధ్యతని, చదువుతోపాటు అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుండాలని, శాంతి మంత్రమే అన్ని విజయాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళ ద్వారా శాంతిపై వారి దృక్పథాలను వ్యక్తపరచటమే కాకుండా, తెలుగు మాట్లాడే శాఖలు ప్రాంతీయ పోటీలను నిర్వహిస్తూ, స్థానిక ప్రతిభను, గుర్తించి, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు వీలు కల్పిస్తాయన్నారు. అనంతరం శాంతి పోస్టర్ పోటీలలో మెరిసిన విద్యార్థిని అభినందిస్తూ, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అందించిన జ్ఞాపికలను, ప్రశంసా పత్రాన్ని, భాష్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఇతర బృందంచే విద్యార్థి ఎల్.వినోద్ కు అందించారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మార్కెటింగ్ ఛైర్పర్సన్ పొడుగు.చరణ్, సభ్యులు రామం, విద్యార్థి వినోద్ పాల్గొన్నారు.

# 8న ఐఎఫ్‌డబ్ల్యూజే సమన్వయ కమిటీ సమావేశం

- శ్రీకాకుళంలో ఎన్జీవో హోంలో నిర్వహణ
- జర్నలిస్టుల సమస్యలపై చర్చ
- హాజరు కావాలని పిలుపు

**నవతరం-శ్రీకాకుళం**

ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) శ్రీకాకుళం జిల్లా శాఖ సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 8వ తేదీన స్థానిక ఎన్జీవో హోంలో నిర్వహించనున్నట్లు ఉత్తరాంధ్ర రీజినల్ కన్వీనర్ ఎం.వి. మల్లేశ్వరరావు తెలిపారు.
ఈ సమావేశంలో సంస్థాగత నిర్మాణం, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, జిల్లా కన్వీనర్ కమిటీ ఏర్పాటు వంటి అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.
జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అరసవల్లిలో భక్తులకు చల్లని ఉపశమనం

- జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మజ్జిక పంపిణీ
- వేసవి వేడిలో సేవా కార్యక్రమం ప్రశంసనీయం
- ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన



**నవతరం-శ్రీకాకుళం**

ఆరోగ్యప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి ప్రాంగణంలో భక్తులకు జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిక పంపిణీ నిర్వహించారు. ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి ప్రసాద్, పేదల వైద్యులు డా. ఇంజరాపు మోహన్, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు మేనేజర్ డా. టి. మణికంఠరావు పాల్గొని భక్తులకు మజ్జిక అందించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆది దేవుడు సన్నిధిలో భక్తులకు మజ్జిక పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఉపశమనం కలిగించేలా జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. జిల్ ఫౌండేషన్ ఎప్పుడూ అమూల్యమైన సేవలను అందిస్తోందని, రానున్న రోజుల్లో వేసవి తాపం మరింత పెరుగుతుందని తెలిపారు.
అవసరం ఉంటే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.
ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు జాగ్రత్త వహించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు లేదా టోపీ వంటి రక్షణ సాధనాలు ఉపయోగించాలని తెలిపారు. వీలైనంత ఎక్కువగా నీరు తీసుకుంటే వడదెబ్బలు నివారించవచ్చని పేర్కొన్నారు.
ఈ సేవా కార్యక్రమంలో న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి కె. శివకుమార్, జిల్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**